క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు

బుచ్చిరెడ్డిపాళెం: మడియాల స్వామి, పోలేరమ్మలకు మంగళవారం బుచ్చిరెడ్డిపాళెం గాంధీనగర్ పరిసర ప్రాంతాల్లోని రజకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరతరాలుగా ఈ ఆచారాన్ని కొనసాగిస్తున్నట్లు బిట్రగుంట రమేష్‌బాబు వెల్లడించారు.

పల్లెపై పొగమంచు పందిరి



ముత్తుకూరు కాలనీలో పొగ మంచు

ముత్తుకూరు: మండలంలోని పల్లెలను మంగళవారం ఉదయం దట్టమైన పొగ మంచు దుప్పటిలా కమ్మేసింది. పందిరి మాదిరిగా పరుచుకుంది. తెల్లని పొగ మంచు ధాటికి రోడ్లు కనిపించని పరిస్థితి ఏర్పడింది. సూర్యోదయమైనప్పటికీ లైట్ల వెలుగులోనే వాహనాలు ప్రయాణించాయి. ఆహ్లాదకరమైన ఈ వాతావరణం 10 గంటల వరకు కొనసాగింది.

విశ్వనాథుడికి రుద్రాభిషేకం



ప్రత్యేకాలంకరణలో విశ్వనాథుడు

మనుబోలు: చెర్లోపల్లి రైల్వేగేటు సమీపంలో ఉన్న విశ్వనాథస్వామి ఆలయంలో బహుళ త్రయోదశిని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేపట్టారు. చెన్నారెడ్డి మోహన్‌రెడ్డి, సునీల దంపతులు అన్నప్రసాదాల తయారీ కోసం రూ.20 వేల విలువైన పాత్రలను కానుకగా అందించారు.

పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలు



గాయాలైన దృశ్యం

పొదలకూరు : పట్టణంలోని సాయిబాబా మందిరం, రామనగర్‌గేటు సెంటరు ప్రాంతంలో ఓ పిచ్చి కుక్క మంగళవారం స్వైర విహారం చేసి నలుగురిని గాయపరిచిన ఘటన మంగళవారం జరిగింది. బాధితులు స్థానిక సీహెచ్‌సీకు వెళ్లి చికిత్స పొందారు. ఇటీవల కుక్కల స్వైర విహారం పెరిగింది. గ్రామాల్లో కూడా కుక్కల దాడిలో పలువురు గాయపడుతున్నారు.


నేత్రపర్వంగా గ్రామోత్సవం



గ్రామోత్సవంలో సాయినాథుడి వైభవం

ముత్తుకూరు: మండలంలోని వల్లూరులో కొలువైన శ్రీశివసాయిబాబా మందిర ద్వితీయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి ప్రారంభించిన గ్రామోత్సవం మంగళవారం వేకువజాము వరకు కనుల పండువగా జరిగింది. నిర్వాహకులు వల్లూరు మోహన్‌రావు ఆధ్వర్యంలో విద్యుద్దీపాలు వివిధ పూలమాలలతో అలంకరించిన వాహనంలో బాబాను ప్రతిష్టించి మేళతాళాల నడుమ గ్రామోత్సవం వైభవంగా సాగింది.

భార్యాభర్తలపై దాడి.. తీవ్రగాయాలు



గాయపడిన భార్యాభర్తలతో మాట్లాడుతున్న ఎస్సై

పొదలకూరు: పట్టణానికి సమీపంలోని వెంకటేశ్వరనగర్ ఎస్సీ కాలనీకు చెందిన భార్యాభర్తలపై పక్కింటి వారు మంగళవారం కత్తితో దాడికి పాల్పడడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. ఎస్సై ఎస్‌కే హనీఫ్ కథనం మేరకు.. తోకంచి ఎస్సీ కాలనీకి చెందిన భార్యాభర్తలు ఉడుముల రాము, లక్ష్మమ్మపై అదే కాలనీకు చెందిన కొల్లారి రాజు, సుజాత దంపతులు కత్తితో తల, చేతులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. నిందితుల కుమారుడితో బాధితుల బంధువుల అమ్మాయి మాట్లాడుతుందన్న కారణంతో దాడికి పాల్పడ్డారు. సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితుల నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యం.. దయనీయం

- డాక్టర్లు ఉన్నా.. వేధిస్తున్న మందల కొరత
- గత ప్రభుత్వంలో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో మెరుగైన వసతులు
- గతంలో అన్ని రకాల మందులు అందుబాటు

అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని ఉన్నట్లు.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు లక్షణంగా ఉన్నప్పటికీ.. వైద్య సేవలే కడు దయనీయంగా ఉన్నాయి. గత ప్రభుత్వం పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో మౌలిక వసతులు కల్పించి, అభివృద్ధి చేపట్టింది. వైద్యుల కొరతను తీర్చింది. దాదాపు అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచింది. ప్రస్తుతం ఆస్పత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉన్నప్పటికీ మందుల కొరత కారణంగా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించలేని పరిస్థితి నెలకొంది. గతంలో ఇంటింటికీ వచ్చి వైద్య సేవలు అందించిన డాక్టర్లు.. ఇప్పుడు ఆస్పత్రిలో కూర్చొన్నా.. వైద్యం చేయించుకునేందుకు జనం మొగ్గుచూపని పరిస్థితి నెలకొంది.



కొడవలూరు పీహెచ్‌సీలో ఓపీ తీసుకుని వేచి ఉన్న రోగులు

సాక్షి విజిట్

అందుబాటులో ఒక్కరే..

కొడవలూరు: పీహెచ్‌సీలు గ్రామాల్లో ఎంతో కీలకంగా వ్యవహరించాల్సి ఉంది. కానీ చిన్నపాటి ఆరోగ్య సమస్యల్ని చూడటం వరకే పరిమితమవుతున్నట్లు విమర్శలున్నాయి. మండల కేంద్రమైన కొడవలూరులోని పీహెచ్‌సీని మంగళవారం సాక్షి విజిట్ చేసింది. ఇక్కడ ఇద్దరు వైద్యులున్నారు. ఒకరిని పింఛన్ల వెరిఫికేషన్‌కు నియమించారు. మరొకరు మాత్రమే అందుబాటులో ఉన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 35 మంది రాగా, ఆ తర్వాత ఐదుగురు వచ్చారు. పాముకాటు లాంటి అత్యవసర కేసులొస్తే సీహెచ్‌సీలకు పంపుతున్నారు.

మందుల్లేవు

ఇందుకూరుపేట: మండలంలోని జగదేవిపేట పీహెచ్‌సీలో అన్ని మందులు అందుబాటులో లేవు. ఈ సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

20 పంచాయతీలకు ఒకే పీహెచ్‌సీ

ముత్తుకూరు: పరిశ్రమలకు కేంద్రంగా ఉన్న ముత్తుకూరు మండలంలో జనాభా విస్తరణ పెరిగింది. 20 పంచాయతీలు ఉన్నప్పటికీ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం మాత్రం ఒక్కటే అందుబాటులో ఉంది. మంగళవారం 'సాక్షి' విజిట్ చేసిన సమయంలో వైద్యులు అందుబాటులోనే ఉన్నారు. దాదాపు 82 మందికి వైద్య సేవలు అందించారు. అయితే వైద్యం కోసం మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి రావాలంటే కొన్ని గ్రామాల ప్రజలు రెండు బస్సులు మారాల్సి వస్తోంది. తాళ్లపూడిలో రెండో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వంలో ప్రతిపాదన జరిగింది. అయితే ప్రభుత్వం మారడంతో అది కార్యరూపం దాల్చలేదు.

పీహెచ్‌సీ వైపు రాని రోగులు

వెంకటాచలం: మండలంలోని ఇస్కపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గత కొన్ని నెలల నుంచి రోగులు సక్రమంగా రావడం లేదు. గత ప్రభుత్వంలో మెరుగైన సేవలు అందించిన వైద్యశాలల్లో ప్రస్తుతం దయనీయ పరిస్థితి ఉంది. దీంతో సర్వేపల్లిలోని ప్రైవేట్ వైద్యుల వద్దకు వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు. మంగళవారం ఉదయం పీహెచ్‌సీకి వైద్యాధికారిణి, ఇతర సిబ్బంది వచ్చినా, మధ్యాహ్నం వరకు రోగులు అంతంత మాత్రమే వచ్చారు. జ్వరం, జలుబు తదితర రోగాలతో 12 మంది పీహెచ్‌సీకి వచ్చారు. పీహెచ్‌సీలో చేసే వైద్యం, పంపిణీ చేసే మందులకు వ్యాధి తగ్గతుందనే నమ్మకం లేక రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ లేక ఇక్కట్లు

తోటపల్లిగూడూరు: మండలంలోని వరిగొండ పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో రక్త పరీక్షలకు వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం సాక్షి ప్రాథమిక వైద్యశాలల్లో వైద్యసేవలపై విజిట్ చేసింది. వరిగొండ పీహెచ్‌సీని ఉదయం 9.30 గంటలకు తీశారు. 10 గంటలకు డాక్టర్ అశోక్ విధులకు హాజరయ్యారు. మరో వైద్యురాలు ఇంటింటి సర్వే ఉందంటూ 11 గంటలకు వచ్చారు. మిగిలిన స్టాఫ్ 10.30 గంటల్లోపు ఒక్కొక్కరుగా వైద్యశాలకు వచ్చారు. మంగళవారం మొత్తం 52 మంది రోగులు వైద్య సేవలను పొందారు. రోగులకు అవసరమైన మందుల్లో 50 శాతం మేర వైద్యశాలలో అందుబాటులో లేవవని తెలిసింది.

దూరాభారంతో ఇబ్బందులు



ముత్తుకూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలంటే చాలా దూరం ప్రయాణం చేయాలి. మా గ్రామానికి బస్సు సౌకర్యం కూడా లేదు. ఆటోలో ప్రయాణం ఖర్చుతో కూడుకొంది. పంటపాళెంలో మరో ప్రభుత్వ ఆస్పత్రి ఉంటే చాలా మంది పేదలకు సౌకర్యంగా ఉంటుంది.

– శేషమ్మ, మిట్టపాళెం



డాక్టర్ పిలుపు కోసం ఎదురుచూస్తున్న రోగులు



ఇస్కపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



తోటపల్లిగూడూరు: రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అశోక్

దరఖాస్తుల ఆహ్వానం

బుచ్చిరెడ్డిపాళెం: ఎస్సీ, బీసీ, మైనార్టీ ఓబీసీ కాపు కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాలు పొందేందుకు ఓబీఎంఎంఎస్ పోర్టల్లో ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీహరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 8 నుంచి 11వ తేదీ వరకు దరఖాస్తులను పరిశీలిస్తారని, అనంతరం మండల అధికారులు, బ్యాంక్ అధికారులు క్షేత్ర పరిశీలన చేసి లబ్ధిదారుల ఎంపికను 12 నుంచి 14వ తేదీలోగా పూర్తి చేస్తారన్నారు. అనంతరం జాబితాను ఉన్నతాధికారులకు పంపుతారని వెల్లడించారు.

ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ

వెంకటాచలం: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని కాకుటూరులో ఉన్న ఆర్టీసీ జోనల్ శిక్షణ కళాశాలలో మంగళవారం ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ నిచ్చారు. ఎంఈవీ పూర్ణ చంద్రరావు, డాక్టర్ ఎం.వెంకటతరుణ్, డాక్టర్ వంశీకృష్ణ, సీఐ సుబ్బారావు తదితరులు హాజరై వాహనాలు నడిపేటప్పుడు డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జోనల్ శిక్షణ కళాశాల సిబ్బంది ఎస్.లక్ష్మి, ఎస్.రాజశేఖర్‌రెడ్డి, ఇస్మాయిల్, ఏ సుబ్బారావు, జేఎంఎస్ రావు, జయరామయ్య, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 31న మున్సిపల్ సమావేశం

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ సమావేశం ఈ నెల 31వ తేదీన జరుగుతుందని అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నుడా, ఇతర నిధుల వినియోగంపై చర్చించనున్నట్లు వెల్లడించారు. అదే విధంగా నగర పంచాయతీలో ఖాళీగా ఉన్న రెండు వైస్ చైర్మన్ల ఎన్నిక ఫిబ్రవరి 3వ తేదీన జరుగుతుందన్నారు.

1న కబడ్డీ పోటీలు

కొడవలూరు: మండలంలోని సంగాయపాళెంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో వచ్చే నెల 1న కబడ్డీ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు మహీధర్, అశోక్, సాగర్‌లు మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆరోజు ఉదయం 9 గంటలకు ప్రవేశ రుసుము కింద రూ.100 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మొదటి బహుమతి కింద రూ.20 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.12 వేలు, నాలుగో బహుమతి రూ.10 వేలు, ఐదో బహుమతిగా రూ.6 వేలు ఇస్తామని తెలియజేశారు.

ఉచిత పశువైద్య శిబిరాలతో పాడి రైతులకు మేలు



దూడకు నట్టల నివారణ మందు తాగిస్తున్న సిబ్బంది



పొట్లపూడిలో ఉచిత పశువైద్య శిబిరం దృశ్యం

తోటపల్లిగూడూరు: ఉచిత పశువైద్య శిబిరాలతో పాడి రైతులకు ఎంతో మేలు కలుగుతోందని విజయవాడలోని వెటర్నరీ బయాలాజికల్స్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డీడీ షిలాని పేర్కొన్నారు. మండలంలోని పొట్లపూడిలో మంగళవారం ఉచిత పశు వైద్యశిరం జరిగింది. డీడీ షిలాని మాట్లాడుతూ పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులను గుర్తించడంతోపాటు సత్వర వైద్యం అందించాలనే సదుద్దేశంతో పశువైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాడి రైతులు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 102 లేగదూడలకు, 171 పెద్ద పశువులకు డీవార్మింగ్ మందులు అందజేశారు. 28 పశువులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు, మరో 42 పశువులకు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ నెల్లూరు డివిజన్ డీడీ డాక్టర్ నాగమణి, ఇందుకూరుపేట ఏడీఏ డాక్టర్ మురళీకృష్ణ, కోడూరు పశువైద్యాధికారి నరేష్, స్థానిక ఎల్ఎస్ఏ షఫీ, జేవీఓ రవి, ఏహెచ్ఏలు ఖాదర్‌నవాజ్, అజ్గర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

మనుబోలు: పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మడమనూరు పశు వైద్యశాల వైద్యాధికారి షరీఫ్ అన్నారు. మండలంలోని గురివిందపూడిలో మంగళవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. మొత్తం 228 పశువులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు, చికిత్స అందించారు. 69 దూడలకు నట్టల నివారణ మందులను తాగించారు. ఈ నెల 31 వరకు గ్రామాల వారీగా పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు. ఈ శిబిరంలో పశు వైద్య సిబ్బంది కళ్యాణి, కామాక్షమ్మ, మస్తానయ్య, శ్రీనివాసులు, ఇమామ్‌బాషా తదితరులు ఉన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతతోనే అభివృద్ధి



వీఓఏలకు పుస్తకాలు అందజేస్తున్న ఎంపీడీఓ

మనుబోలు: సంపూర్ణ అక్షరాస్యతతోనే అభివృద్ధి సులభతరమవుతుందని ఎంపీడీఓ జలజాక్షి అన్నారు. వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ఉల్లాస్ పథకంపై స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రాథమిక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఆరోగ్యసంరక్షణ, కుటుంబ సంక్షేమంపై అవగాహన తదితర జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. నిరక్షరాస్యులైన వయోజనులను గుర్తించి ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయాలని వీఓఏలకు సూచించారు. ఫిబ్రవరి 2 నుంచి వచ్చే ఏడాది మార్చి 15 వరకు 200 గంటల బోధనా క్లాసులు నిర్వహించాలన్నారు. వీఓఏలకు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు భాగస్వామ్యం కావాలని కోరారు. స్త్రీనిధి మేనేజర్ మధుసూదన్‌రావు, ఏపీఎం వనజాక్షి, సీసీలు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి



రిజర్వాయర్‌లోకి చేప పిల్లలు విడుదల చేస్తున్న సోమిరెడ్డి

వెంకటాచలం: కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సర్వేపల్లి రిజర్వాయర్‌లో 5.62 లక్షల చేప పిల్లలను మంగళవారం సోమిరెడ్డి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మీనోత్సవంలో భాగంగా ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద రిజర్వాయర్‌లోకి 60 శాతం ప్రభుత్వ నిధులు, 40 శాతం మత్స్యకార సొసైటీతో ఈ చేప పిల్లలను విడుదల చేయడం జరిగిందన్నారు. తిక్కవరప్పాడు, అనికేపల్లి, సర్వేపల్లితోపాటు మొత్తం 11 గ్రామాల్లోని 500 మందికిపైగా మత్స్యకారులుకు చేపల వేట ద్వారా లబ్ధి చేకూరుతుందని తెలియజేశారు. ఆయన వెంట మత్స్యశాఖ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శ్రీవెంకటేశ్వరలో పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరించిన గుణశేఖర్

కొడవలూరు: నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ కె.గుణవర్ధన్, నరేంద్రలు రచించిన 'డీసీ ఎలక్ట్రికల్ సర్క్యూట్ అనాలసిస్' పుస్తకాన్ని ఆ కళాశాలలో చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకం బీటెక్, డిప్లొమా విద్యార్థుల అధునాతన సిలబస్‌ను అనుసరించి రచించడం జరిగిందన్నారు. విద్యార్థులు పరిశోధనా వ్యాసాలు, పుస్తకాలు రాయంలో ఇవి ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రకాష్‌రావు, ఏఓ కె.గిరీష్‌కుమార్, ఆర్‌అండ్‌డీ డీన్ నాగేంద్రలు పాల్గొన్నారు.

హిందీ పాఠ్యాంశం షార్ట్ ఫిలింగా రూపకల్పన



షార్ట్ ఫిలింలో నటించిన విద్యార్థులు, రూపకర్తతో హెచ్‌ఎం

కొడవలూరు: 8వ తరగతి హిందీ పాఠ్య పుస్తకంలోని 'షార్' అనే పాఠ్యాంశాన్ని గండవరం హైస్కూల్ హిందీ పండిట్ జి.నాగభూషణం షార్ట్ ఫిలింగా రూపొందించారు. దీనిని హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు, హిందీ పండిట్ నాగభూషణం మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షార్ ఏర్పాటు వల్ల కలిగే లాభాలు, అక్కడ చూడాల్సిన ప్రదేశాలను ఇందులో చిత్రీకరించడం జరిగిందన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించేందుకు కూడా ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ షార్ట్ ఫిలింను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. ఇందులో నటించిన పాఠశాల విద్యార్థులు సాయి హామిక, రిషిత, మస్తాన్ బాషాలను హెచ్‌ఎం అభినందించారు.

వీఎస్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులకు అభినందన



ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులను అభినందిస్తున్న ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం: విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులను ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు మంగళవారం అభినందించారు. వీఎస్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ద్వారా విశేష సేవలందించిన డాక్టర్ ఉదయ్‌శంకర్, డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి, కె.అంకయ్య, సునీల్‌కుమార్, టి.భారతిలకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందజేశారు.

వరిలో ఎలుకుల నివారణ అవసరం



మాట్లాడుతున్న ఏఓ జహీర్



కొడవలూరు మండలంలో..

తోటపల్లిగూడూరు: వరి సాగులో ఎలుకుల నివారణ చాలా ముఖ్యమైందని ఏఓ శిరీషారాణి సూచించారు. మండలంలోని చిన్నచెరుకూరు, ఇస్కపాళెం రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం వరిలో యాజమాన్య పద్ధతులు, ఎలుకుల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడులు సాధించాలంటే సరైన యజమాన్య పద్ధతులను పాటించాల్సిందన్నారు. అంకురం ఏర్పడే దశకు దగ్గరవుతున్నందున తప్పనిసరిగా యూరియాతో పాటు 25 కేజీల పొటాష్‌ను కలిపి వాడాలన్నారు. అధిక యూరియాతో తాలు గింజలు ఏర్పడడంతో పాటు దోమపోటుకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఒక వేళ పైరు దోమపోటు వస్తే.. నత్రజని ఎరువుల వినియోగాన్ని తగ్గించడంతో పాటు గట్టుపై ఉన్న గడ్డిని కోసి శుభ్రం పరిచితే దానిని నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ షర్మిల, శివకుమార్, ఇతర వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

మనుబోలు: రైతులందరూ ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని ఏఓ షేక్ జహీర్ సూచించారు. మండలంలోని కట్టువపల్లిలో మంగళవారం ఈ క్రాప్ నమోదుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పంటల బీమా, ధాన్యం కొనుగోలుకు సంబంధించిన వివరాలను ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏఏఓ కళారాణి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నమోదు చేసుకోవాలి

ఇందుకూరుపేట: రైతులు వేసిన పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ రాజ్‌కుమార్ అన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో గంగపట్నం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వరి సాగులో వెన్ను తీసే సమయంలో రైతులకు సూచనలు, సలహాలను ఏడీ తెలియజేశారు. కార్యక్రమంలో వీఏఏలు సుదీక్షణ, నరహరి, రైతులు పాల్గొన్నారు.

ఎలుకల నివాణకు చర్యలు

విడవలూరు: రైతులు వరి పొలంలో ఎలుకల నివారణ చర్యలు తీసుకోవాలని, లేకుంటే పంట నష్టం జరుగుతుందని కోవూరు వ్యవసాయ సహాయకురాలు డి.సుజాత తెలిపారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామంలోని పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.వెంకటకృష్ణయ్య, వీఏఏ టి.అరుణ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో

కొడవలూరు: మండలంలోని గండవరం, నాయుడుపాళెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ సీహెచ్ఎస్ లక్ష్మి మాట్లాడుతూ పాము పొదను నివారించుకోవాలని సూచించారు. అనంతరం సామూహిక ఎలుకల నివారణను ప్రయోగాత్మకంగా వివరించి బ్రోమో డైలిన్ మందును ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఏఏలు కె.శ్రావ్య, టి.కవిత, స్థానిక నాయకుడు మాగుంట సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.



విడవలూరు: అవగాహన కల్పిస్తున్న అధికారులు



ఇందుకూరుపేట: మాట్లాడుతున్న అధికారులు